క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పించండి

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. పరీక్ష హాల్‌లో గాలి, వెలుతురు బాగా వచ్చేలా, ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి వసతులు ఉండాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి రేగాలమ్మ ఉత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో రేగాలమ్మ ఉత్సవాలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో సోమ, మంగళవారాలు ఘటాల తిరువీధి, ప్రత్యేక పూజలు, బుధవారం అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

వాహన తనిఖీలు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద ట్రైనీ ఎస్‌ఐలు శ్రీను, లావణ్య, శ్రావణిలతో కలిసి కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వారిని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎస్‌ఐ సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పాలకొండ : ప్రజలంతా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం. చంద్రమౌళి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా సామాన్యుల సొమ్ము కాజేస్తున్నారని తెలిపారు. సాంకేతికత పెరిగిన నేపథ్యంలో దానిని వినియోగించడంలో అవగాహన ఉండాలని సూచించారు. ప్రధానంగా ఆన్‌లైన్ విధానంతో మోసాలకు ఎక్కువగా అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల ఏటీఎం వద్ద ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. మొబైల్ ఫోన్‌లకు వచ్చే అనసవర లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు.

ఫారంపాండ్స్ పనులు వేగవంతం చేయాలి

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఫారం పాండ్స్ పనులను వేగవంతం చేయాలని ఆ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అల్లు లావణ్యకుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని గెద్ద తిరువాడ, బీజేపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఫారం పాండ్స్ పనులను ఆదివారం పరిశీలించారు. ఫారం పాండ్స్ ద్వారా రైతులు ఎంతో లబ్ధి పొందుతారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేతనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. టెంట్లు ఏర్పాటు, పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపు తదితర విషయాలపై మాట్లాడారు. ఏపీఓ తులసీదాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏనుగుల జోన్ నిర్మాణ పనులు ఆపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఆర్.వేణు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం సీతానగరం మండలంలోని జోగింపేట పరిధిలో ఏనుగుల జోన్‌ను జనావాసాల మధ్య ఏర్పాటు చేయడాన్ని విరమించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆదివారం మండల సీపీఎం కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ గశాఖ అధికారులు సీతానగరం మండలంలోని జోగింపేట–అప్ప య్యపేట, గుచ్చిమి గ్రామాల సమీపంలో ఉన్న కొండపై ఏనుగుల జోన్ నిర్మాణం చేస్తున్న ప్రాంతంలో గత ప్రభుత్వం గిరిజన, ఎస్సీ కుటుంబాలకు భూములు ఇచ్చిందని అందులో వ్యవసాయ పనులు చేసుకుంటూ కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలియజేశారు. పభుత్వం స్పందించి ఏనుగుల జోన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని లేని పక్షంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

‘పది’లో పట్టు.. భవితకు మెట్టు!



పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

- విద్యార్థి దశలో పదో తరగతి కీలకం
- పరీక్షల భయం వీడితేనే మార్కులు సొంతం
- ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలి..
- నేటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

గరుగుబిల్లి: విద్యార్థి దశలో పదో తరగతి కీలకం. పబ్లిక్ పరీక్షలు అనగానే విద్యార్థుల్లో సహజంగా భయం, ఆందోళన నెలకొంటుంది. పరీక్షలు రాస్తున్నప్పుడు కూడా ఇదే కొనసాగితే ఆశించిన మార్కులు సాధించడం కష్టమవుతుంది. పరీక్షల ఒత్తిడి లేకుండా ధైర్యంగా రాయగలిగితే మంచి మార్కులు సొంతమవుతాయి. పదో తరగతిలో తెచ్చుకునే మార్కులే తర్వాతి చదువుల్లో బాగా ఉపయోగపడి తద్వారా బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు కానుండడంతో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం..

పరీక్షల సమయంలో తీవ్రమైన ఒత్తిడికి లోనై విద్యార్థులు సరిగా ఆహారం కూడా తీసుకోరు. అలాగే నిద్ర కూడా పోరు. ఇలాంటి పరిస్థితుల్లో చదివిన అంశాలు కూడా సరిగా గుర్తుండవు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులంతా తొలుత పరీక్షలన్న భయం వీడాలి. ముఖ్యంగా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ఆరోగ్యంగా ఉంటేనే పరీక్షలన్నీ రాయగలమన్న నమ్మకం కలిగించాలి. ప్రతి పరీక్షకు చదివేటప్పుడు వేకుజామున లేచి కఠినమనిపించే అంశాలను ముందుగా చదువుకోవాలి. చదవడం ఎంత ముఖ్యమో చదివిన దాన్ని గుర్తు పెట్టుకోవడం, దానిని పరీక్షల్లో రాయడం అంతే ముఖ్యం. పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమైతే విద్యార్థులు సాధించాల్సిన లక్ష్యాలు చాలా సులభంగా చేరుకోవచ్చని విద్యావేత్తలు, నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి..

- ఆరోగ్యం బాగా ఉండి, పరీక్షలన్నీ రాయాలంటే తేలికపాటి ఆహారం తీసుకోవాలి.
- అధికంగా ఆయిల్, కారం, మసాలాలతో వండిన పదార్థాలు తినకూడదు.
- పెరుగు, మజ్జిగ పరిమితంగా తీసుకోవాలి.
- అందుబాటులోని తాజా పండ్లు తినాలి.
- పరీక్షలు జరిగినన్ని రోజులు మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- మెదడు చురుగ్గా పనిచేసేందుకు ప్రోటీన్‌తో కూడిన ఆహారం తినాలి.
- ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- పరీక్ష రాసి ఇంటికి వచ్చిన తర్వాత పండ్ల రసాలు తాగాలి.

6 నుంచి 8 గంటల నిద్ర అవసరం..

ప్రతి విద్యార్థికి రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్రం అవసరం. అప్పుడే మెదడు బాగా పనిచేసి, చదివింది బాగా గుర్తుంటుంది. వేకుజాము 4:30 గంటలకు నిద్ర లేచి రాత్రి 10 గంటలకు నిద్రపోవడం అలవాటుగా చేసుకోవాలి. ఉదయం, సాయంత్రం కొంతసేపు వ్యాయామం చేసుకుని, టిఫిన్ కింద ఇడ్లీ తీసుకుంటే మంచిది. –డాక్టర్ ఎస్.సంతోష్‌కుమార్, గరుగుబిల్లి పీహెచ్‌సీ

ఐదు కేంద్రాల్లో ‘పది’ పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో సోమవారం నుంచి జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బి.చంద్రశేఖర్ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలురు పాఠశాలలో 170 మంది, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో 170 మంది, గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 162 మంది, టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 163 మంది, రేగిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 142 మంది చొప్పున మొత్తం 807 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించడం జరిగిందన్నారు.

కురుపాంలో మూడు కేంద్రాల్లో..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ధర్మలక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఆయా కేంద్రాలకు మొత్తం 662 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈవో ఎస్.సత్యనారాయణ తెలిపారు.

కొండ చీపురు ఎంత..?

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. సాధారణ వినియోగదారుడిలా అటవీ ఉత్పత్తులు విక్రయిస్తున్న వారి వద్దకు వెళ్లి వ్యాపార సరళిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఓ గిరిజనుడి వద్దకు వెళ్లి కొండచీపురు ఎంతకు విక్రయిస్తున్నావని అడగ్గా... తమ వద్ద నుంచి వ్యాపారులు రూ. 25 నుంచి 30 రూపాయల మధ్య కొనుగోలు చేస్తున్నారని తెలిపాడు. తమకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదని రాజేంద్ర అనే గిరిజనుడు తెలిపారు. పైనాపిల్ తరహాలో ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో కూడా కొండచీపుర్లు విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని జీసీసీ మాజీ డైరెక్టర్ సవర గంగారావు, మాజీ సర్పంచ్ ఎస్.సాయికుమార్ ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి పీఓ స్పందిస్తూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్దకు వస్తే.. ఇతర ప్రాంతాల్లో అమ్మకాలు చేసుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ డి.కృష్ణ, నరసింహులు ఉన్నారు.



కొండచీపుర్లు ఎంతకు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకుంటున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

పాలకొండ రూరల్: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. పాలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు మండల పరిధిలోని లుంబూరు మినీ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం నిర్వహణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ గృహోపకరణాలతో పాటు ఏసీ, ఫ్రిజ్ వంటివి వాడకంలో పొదుపు మంత్రం పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ, తదితర సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈయన వెంట ఏఈ శ్యాంసుందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ బి.జీవరత్నం. సిబ్బంది ఉన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిర్వహణ పనులు చేపడుతున్న అధికారులు

అ‘పూర్వ’ కలయిక



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986లో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. 39 ఏళ్ల తర్వాత పాఠశాల ఆవరణలో కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏయే వృత్తుల్లో స్థిరపడ్డారో తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. – వీరఘట్టం

పది పరీక్షలకు సర్వం సిద్ధం

భామిని: పదో తరగతి పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 154 మంది, సాంఘిక సంక్షేమ గురుకులంలో 254 మంది, బత్తిలిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా రాడ వెంకటరమణ, శారద, వెంకటరమణ వ్యవహరిస్తారన్నారు.

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలలు, ఓ కేజీబీవీ, మూడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి సాలూరు మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీ డియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంజలిదేవి ఓ ప్రకట నలో తెలిపారు. సోమవారం నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారు రూ. 200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీఎంఎస్, ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్, సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచించారు.

వసంత మహోత్సవాలకు ముహూర్తపు రాట

సాలూరు: పట్టణంలోని 10వ వార్డు నెయ్యిల వీధిలో శ్రీరామమందిరం వద్ద సీతారామలీల వసంత మహోత్సవాల సందర్భంగా ఆదివారం ముహూర్తపు రాటను వేశారు. ఆకేటి రామకృష్ణ, లక్ష్మి దంపతులతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజు న ప్రారంభమై 9 రోజుల పూజలు జరిపి శ్రీరా మనవమి రోజున కల్యాణం, పట్టాభిషేకంతో ముగుస్తుందని నిర్వాహక ప్రతినిధి టిక్కలి ధర్మారావు తెలియజేశారు.



శాస్త్రోక్తంగా వేస్తున్న ముహూర్తపు రాట

ఆల్ ద బెస్ట్ ..



సీతంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదివారం రాత్రి సందర్శించారు. పబ్లిక్ పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థినులకు ఆయన ఆల్ ద బెస్ట్ చెప్పారు. పరీక్షల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు. – సీతంపేట

తారెత్తిస్తున్న ఎండలు..



భానుడి ప్రతాపానికి అన్ని వర్గాల ప్రజలు హడలిపోతున్నారు. కొద్ది రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తుండడంతో పాటు వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఆదివారం 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10 గంటలకే ఎండల తీవ్రత పెరగడంతో అవసరమైన జాగ్రత్తలు పటించాలని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో ఈ సమయానికి అధికారులు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు ముఖ్య కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి జాడ ఎక్కడా కనించక పోవడంతో గ్రామాల నుంచి కాలినడకన వచ్చే వారు, పట్టణంలో సంచరించే పాదచారులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చలివేంద్రాలతో పాటు శివారు ప్రాంతాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

భక్తిశ్రద్ధలతో విగ్రహాలకు ప్రాణప్రతిష్ట

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామ సంతోషిమాత ఆలయంలో శివుడు, సత్యసాయిబాబా పాలరాతి విగ్రహాలతో పాటు అభయాంజనేయ స్వామి రాతి విగ్రహాన్ని ఆదివారం ఏర్పాటు చేసి, వాటికి ప్రాణప్రతిష్ట చేశారు. అంతకుముందు ఆయా విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించి, విగ్రహ ఏర్పాటు, ప్రాణప్రతిష్ట, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తున్న భక్తులు

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

గరుగుబిల్లి:

తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నంలో నివాసముంటున్న కురుపాంకు చెందిన గుండె వైద్య నిపుణుడు ఇప్పిలి వరప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. టీటీడీ సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ బి.పారినాయుడుకు ఆ నగదు చెక్కును ఆదివారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పారినాయుడు అన్నారు. ఇదే ఆలయంలో 1979లో తమ వివాహం జరిగిందని, ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు.



రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దాతలు

సామూహిక మరుగుదొడ్ల అధ్వానం

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం చెబుతున్న స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ఇదేనా అని పట్టణంలోని కాపువీధి, గారమ్మ కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర పేరిట అధికారిక కార్యక్రమాల్లో హడావిడి చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శిస్తున్నారు. పట్టణంలోని దాదాపు మూడు కాపు వీధులతో పాటు గారమ్మ కాలనీకి ఉపయోగకరమైన సామూహిక మురుగుదొడ్లు ప్రస్తుతం అధ్వానంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మల, మూత్ర విసర్జనలు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



వినియోగంలో లేని సామూహిక మరుగుదొడ్లు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షేక్ నూరుల్లా తదితరులు

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా షేక్ నూరుల్లా ఇటీవల నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన కురుపాం మండలంలోని చినమేరంగి గ్రామంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులను ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి కట్టబెట్టడంలో మీ కృషి మరువలేనిదని ప్రశంసించారు. స్పందించిన వారు.. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ మంచి గుర్తింపే ఉంటుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఇప్పుడున్న 40 శాతం పార్టీ ఓటు బ్యాంకును పెంచేందుకు అహర్నిశలు శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌరీశంకర్, మండల గ్రీవెన్స్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, కురుపాం వైస్ సర్పంచ్ షేక్ ఆదిలు తదితరులు పాల్గొన్నారు.

టేకు కలపకు రెక్కలు

- చోద్యం చూస్తున్న అధికారులు

భామిని:

విలువైన టేకు కలపను కొంతమంది అక్రమార్కులు తరలించుకుపోతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అనంతగిరి సమీపంలో, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న టేకు చెట్లను కొంతమంది అక్రమార్కులు ఎటువంటి అనుమతుల్లేకుండా నరికేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఈ కలపను తరలించేందుకు వరద కాలువల్లో దాచిపెడుతున్నారు. జన సంచారం లేని సమయంలో వాహనాల్లోకి ఎక్కించి తరలిస్తున్నారు. తాజాగా గురండి వద్ద ప్రభుత్వ భూముల్లో టేకు చెట్లను కలప దొంగలు మాయం చేశారు. ఇటీవల సింగిడి వద్ద ఇదే తరహాలో కలప తరలిపోయింది. ఇంత జరుగుతున్నా, ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నా అటు అటవీ శాఖాధికారులు ఇటు పోలీస్ అధికారులు చర్యలు చేపట్టకపోవటం విమర్శలకు తావిస్తోంది. అధికారుల అండతోనే కలప తరలిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



అనంతగిరి వద్ద దాచిపెట్టిన టేకు దుంగలు